కథ

# వీధికుక్కలు



## గీతా సుబ్బారావు

**సిటీలో కుక్కలమూలంగా ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. వీధి కుక్కల్ని నిర్మూలించే కార్యక్రమం వెంటనే చేపట్టాలని మునిసిపల్ కార్పొరేషన్‌కు కొందరు పెద్దలు విజ్ఞప్తులు పంపించారు.**

నిజమే, వీధికుక్కలు కరవడం మూలంగా పొట్టమీద, బొడ్డుచుట్టూ సూదులు పుచ్చుకోడానికి వచ్చే జనాలు రోజురోజుకీ పెరిగిపోతున్నారని మునిసిపల్ వైద్యశాఖవారు కూడా పత్రికలవారికి చెప్పారు.

"కుక్క కనిపిస్తే కాల్చేయాలి!" అన్నారు ఆవేశంగా ఓ అధికారి.

"వద్దు వద్దు! ఇలాగే మెదడువాపు వ్యాధి వస్తోందని కనిపించిన పందినల్లా కాల్చేస్తే, వీధులన్నీ కంపుకొట్టాయి! శానిటరీ ప్రాబ్లెం వచ్చింది. అలాగే, కనిపించిన కుక్కనల్లా కాల్చేస్తే దొంగతనాలు ఎక్కువైపోతాయి. కొన్ని వీధులలో, కొన్ని కాలనీల్లో వీధి కుక్కల మూలంగానే దొంగతనాలు తగ్గుతున్నాయి!" అని చెప్పారు ఓ పత్రికా విలేఖరి.

ఇంతకీ వాళ్లు ఏ సిటీ గురించి మాట్లాడుతున్నారో ...? ఇది ఏదో ఒక్క సిటీ సమస్య కాదు. రాష్ట్రంలోగల అన్ని సిటీలలో నిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య. సిటీలే కాదు, అన్ని ఊళ్లల్లో కుక్కల సమస్య ఉంది.

"అబ్బబ్బ ...! ఏంటి డాడీ, కుక్కల గోల! అదో పెద్ద సమస్యలాగా మాట్లాడుకుంటున్నారు!" అన్నది కాలేజీ నుంచి వస్తున్న ఓ కాలేజీ అమ్మాయి వాళ్ల డాడీతో.

"కారులో తిరిగేదానివి, నీకేం తెలుస్తుందమ్మా కుక్కల సంగతి?" అన్నది మాతృమూర్తి.

"కుక్కలకంటే భయంకరమైన జంతువులున్నాయి ... రోడ్డుమీద! నా కారు కాలేజీ గేటు వరకేగా వెళ్తుంది!" అన్నది ఆ కాలేజీ గర్ల్.

ఆ అమ్మాయి ఏం మాట్లాడింది?

మీకు అర్థం అయిందా?

నాకు అర్థం కాలేదు.

ఇందులో అర్థం కాకపోవడానికి ఏముందీ? ఇవాళ రోడ్లమీద, కాలేజీల్లో, సినిమాహాల్స్ దగ్గర,

పార్కులదగ్గర ... ప్రతిచోటా కుక్కల్ని మించిన కుక్కలున్నాయి! అదేనండీ బాబూ ... అమ్మాయిల్ని ఏడిపించే ఈవ్ టీజర్స్! నిజానికి దేశంలో ఇంతకంటే పెద్దసమస్య ఉందంటారా?

ఒకప్పుడు ఎవరో కొందరు కుర్రాళ్లు మాత్రమే అమ్మాయిల్ని ఏడిపించేవారు. ఇప్పుడు అమ్మాయిల్ని అబ్బాయిలు అల్లరి చెయ్యడం అనేది ఎలిమెంటరీ స్కూల్లోనే ప్రారంభం అవుతోంది. ఇదివరకంటే కాస్త వయసు చూసేవారు. ఇప్పుడు వయసుతో నిమిత్తం లేదు. బస్‌స్టాప్‌లో ఓ ఇల్లాలు ఒంటరిగా నిలబడితే నలుగురు బడిపిల్లలు "హలో ఆంటీ!" అంటూ అల్లరిచెయ్యడం నిత్యం జరిగే సామాన్య విషయం.

ఓ పదహారేళ్ల హైస్కూలు అమ్మాయి ఒంటరిగా వెళ్తుంటే ఉద్యోగం సద్యోగం లేని, బడితల్లాగా పెరిగిన నలుగురు ఆవారాగాళ్లు అల్లరి చెయ్యడం నిత్యం చూస్తూనే ఉన్నాం.

ఇలా ఈవ్ టీజింగ్ అభివృద్ధి చెందడానికి కారణం ఒకరు అని చెప్పడం కష్టం. కర్ణుని చావుకు ఎన్నో కారణాలున్నట్టు ... ఇవాళ 'అమ్మాయిల్ని వేధించే ఈ కుక్కలు' పెరగడానికి సవాలక్ష కారణాలున్నాయి!

ఇటీవల సినిమారంగంలో చాలామంది దర్శకులు, రచయితలు ఈవ్‌టీజింగ్ అభివృద్ధికి తమవంతు సాయశక్తులా కృషి చేస్తున్నారు. అసలు అమ్మాయిల్ని ఎలా వేధించాలి? ఎవరైనా అమ్మాయి ఎదురు తిరిగితే ఆ అమ్మాయికి ఎలా బుద్ధిచెప్పాలి? ... ఇవన్నీ బోధించే బోలెడు సినిమాలు ఎన్నో వచ్చాయి. ఆ సినిమాలు చూసి అమ్మాయిల్ని వేధించడం కాదు .... ఆ అమ్మాయిల్ని ఎలా లొంగదీసుకోవాలి, ఎలా అనుభవించాలి, లొంగని అభిమానంగల అమ్మాయిల్ని ఎలా శిక్షించాలి ... ఇవన్నీ నేర్చుకోవచ్చు.

ఈమధ్య సెన్సార్ పెద్దలు కూడా జీతాలతోపాటు, గీతాలు తీసుకుని ఆ చిత్రాలకు యు సర్టిఫికెట్స్ ఇస్తున్నారు. ఇంకాస్త ముందుకి వెళ్తే, అలాంటి చిత్రాలకు అవార్డులు కూడా ఇచ్చేస్తున్నారు. ఎందుకంటే, ఆ సినిమాల్లో ఇలాంటి సీన్లు అన్నీ పెట్టి ... చివర్లో 'ఇలా చెయ్యడం పాపం!' అనే ఓ నీతి చెప్పించేస్తారు. అందుకని అవార్డు ఇచ్చేస్తారు మన పెద్దవాళ్లు.

ఈ వేధింపులకి భయపడి చదువులు మానేసినవారు ఎందరో ... ఎందరో ఉన్నారు.


ఈ వేధింపులు భరించలేక ఆత్మహత్యలు చేసుకున్నవారు ఎందరో ... మరెందరో ఉన్నారు.

ఈ వేధింపులకు భయపడి ఎవరో ఒక బాయ్‌ఫ్రెండ్‌తో తిరుగుతున్న అమ్మాయిలూ ఎందరో ఉన్నారు.

మొన్నీమధ్య ఓ పెద్దాయన అన్నారు "బాయ్‌ఫ్రెండ్స్ లేకుండా ఈ రోజుల్లో అమ్మాయి బయటకు వెళ్లలేదు. ఇవాళ అమ్మాయిలు ఈవ్‌టీజింగ్‌కి భయపడే బోయ్‌ఫ్రెండ్స్‌తో తప్పనిసరిగా తిరుగుతున్నారు!" అని. ఆలోచిస్తే అది నిజమే అనిపిస్తోంది.

"ఏమిటోయ్, అమ్మాయిల గురించి తెగ బాధపడిపోతున్నావ్? ఇవాళ అమ్మాయిల వేషభాషలు చూస్తున్నావా? టీనేజ్ గరల్స్ చిన్నచిన్న చెడ్డీలు వేసుకుని కాలేజీకి వస్తున్నారు తెలుసా?" అన్నాడు మా మిత్రుడు.

"నాయనా! ఇది అసెంబ్లీ కాదు, పార్లమెంటూ కాదు. నేను ఈవ్‌టీజర్స్ గురించి మాట్లాడుతుంటే ఆ విషయాన్ని పక్కకుపెట్టి అమ్మాయిల ఫాషన్స్ గురించి మాట్లాడతావెందుకూ? నేను మాట్లాడే




సబ్జెక్ట్‌ని పక్కదారి పట్టించకు! మనం అమ్మాయిల్ని వేధించే వీధి కుర్రాళ్ల గురించి మాట్లాడుకుంటున్నాం!" అని గట్టిగా చెప్పాను.

దేశంలో వీధికుక్కల సమస్యకంటే తీవ్రమైన సమస్య ఈవ్‌టీజింగ్ సమస్య! ముందుగా వీధికుక్కల నిర్మూలన కంటే, వీధి కుర్రాళ్ల నిర్మూలనా కార్యక్రమాన్ని వెంటనే ప్రభుత్వం చేపట్టాలని కొందరు కాలేజీ అమ్మాయిల వాదన.

వీధికుక్కల్నంటే గబగబా పట్టుకుని కుక్కల బండిలో పడేసి పట్టుకుపోయి ఊరవతల చంపిపారేయవచ్చు. కానీ, ఈవ్‌టీజర్స్‌ని అలా పారేయడం సాధ్యమా?

సాధ్యం కాదు. ఎందుకంటే వారిలో పెద్దపెద్దవాళ్ల పిల్లలు ఉంటారు. అధికారుల పిల్లలు ఉంటారు. మొన్నామధ్య మా ఎదురుంటి అమ్మాయి కాలేజీ నుండి వస్తుంటే నలుగురు గొప్పింటి కుర్రాళ్లు మారుతీ వాన్‌లో వచ్చి గభాలున వాన్‌లోకి లాక్కుని ఎక్కడికో తీసుకుపోయి నాలుగురోజులు వాళ్ల సరదాలు తీర్చుకుని, ఓరోజు రాత్రి ఇంటి దగ్గర వదిలేసి పోయారు. పాపం, ఆ తల్లిదండ్రులు ఏం చేశారు?

"మా మీద పోట్లాడి, మా అమ్మాయి మా బంధువుల ఇంటికి వెళ్లింది!" అని పోలీసులకి కూడా అబద్ధం చెప్పి, ఆ పిల్లని చదువు మానిపించేసి చదువూ సంధ్యా లేని ఓ మగాడికిచ్చి గుట్టుచప్పుడు కాకుండా వాళ్ల పల్లెటూరిలో పెళ్లిచేసి చేతులు కడుక్కున్నారు. ఎందుకో తెలుసా? ఆ కుర్రాళ్లల్లో ఓ మంత్రిగారి అబ్బాయి ఉన్నాడట! ఇలాంటి వార్తలు పత్రికల్లో రావు నాయనా! ఆ కుర్రాళ్లు చాలా బుద్ధిమంతులు కాబట్టే ఆ అమ్మాయిని ఇంటిదగ్గర ప్రాణాలతో వదిలేశారు అని ఆ తల్లీతండ్రీ లోలోపల సంతోషించారట!" అని చెప్పింది మా పక్కింటి మహిళామండలి సభ్యురాలు.

ఇవాళ అమ్మాయిల వేధింపు, రాగింగ్ అనేవి పాఠశాల నుంచి యూనివర్సిటీ వరకు ముఖ్యమైన సబ్జెక్ట్‌లు అయిపోయాయి! విద్యార్థులు ఏ సబ్జెక్టులు తీసుకున్నా, ఏం చదువుతున్నా ఈ సబ్జెక్టులు కంపల్సరీ!


కాలేజీ కాంటీన్‌లో టీ, కాఫీ దొరక్కపోయినా ... ప్రేమ అనేదీ మాత్రం ... అన్ని విద్యాలయాల్లో విరివిగా దొరికే వస్తువు! అందుకే కాలేజీ అమ్మాయిని చూడగానే గేటులో నిలబడిన వాచ్‌మన్ కూడా "ఐ లవ్ యూ!" అనవచ్చు, తప్పులేదు. ఒకవేళ తప్పు అని ఎవరైనా అంటే పెద్ద గందరగోళమే! వాచ్‌మన్ మనిషికాదా? వాచ్‌మన్ అయినంత మాత్రాన ప్రేమించే హక్కు ఉండదా? ఇలాంటి విషయాలు ఆలోచించకండి. ఇవి చాలా దూరం వెళ్లిపోయి కాలేజీ బంద్, సిటీబంద్ వరకూ దారితీస్తాయి. కాబట్టి చూసీ చూడనట్టు, తెలిసీ తెలియనట్టు ఉండాలి.

"అసలీ పెద్దవాళ్లకి ప్రేమ అంటే అర్థం తెలుసా? ప్రేమ విలువ తెలుసా?" అని యువతరం ఎదురు తిరిగిపోతుంది. అందుకని ఎవరైనా ఓ వెధవ మీ అమ్మాయిని పిలిచి "ఐ లవ్ యూ" అంటే, మీరు వినకండి! విన్నా, వినిపించనట్టు నటించి ధైర్యం ఉంటే చదివించండి, లేకుంటే పెళ్లి చేసెయ్యండి! ఎందుకంటే ప్రేమ ఎంత గొప్పదో, ఎంత పవర్‌ఫుల్లో తెలియజేసే

కథతో వారానికో సినిమా వస్తోంది.

"ఆమధ్య పేపర్లో చూసే ఉంటారు.... ఓ అబ్బాయి ఓ అమ్మాయిని చూసి ఐ లవ్ యూ అన్నాడట. అమ్మాయి ఛీ, పో అంది. అంతే, అబ్బాయి విలన్‌గా మారిపోయి ఆ అమ్మాయిని చంపేశాడు. అంచేత ... పిల్లలు ప్రేమ ప్రేమ అనగానే, పెద్దలు జాగర్తగా ఆలోచించి.... ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి!" అని చెప్పారు యాభైఏళ్ల ఓ కాలేజీ లెక్చరర్.

"ప్రేమా! నా పిండాకూడా! ఈవ్‌టీజింగ్‌ని చూస్తూ వదిలేయబట్టే అమ్మాయిలూ, అబ్బాయిలూ ఇలా వెర్రివేషాలు వేస్తున్నారు. ఈవ్‌టీజింగ్ మీద కఠినచర్యలు తీసుకుంటే సరి!" అని అతి తేలిగ్గా చెప్పాడు ఇటీవల రిటైర్ అయిన మిలటరీ ఆఫీసర్ రామ్‌సింగ్.



ఆయనకేం తెలుసూ .... ప్రస్తుతం ఉన్న పరిస్థితి? మిలటరీలో క్రమశిక్షణ ఉందికాబట్టి, పై ఆఫీసర్ మాట మిగతావాళ్లు వింటారు కాబట్టి మిలటరీలో ఏదైనా సాధ్యపడుతుంది. అసలు మనదేశంలో క్రమశిక్షణ ఎక్కడ ఉంది? అసలు క్రమశిక్షణ అంటే ఏమిటీ అని అడిగే స్థితిలో ఉన్నాం మనం.

ప్రధానమంత్రి మాట కిందనున్న మంత్రిగారే వినడు! పార్లమెంటు సభ్యులు స్పీకరు మాట వినరు. అసెంబ్లీలో గవర్నరు మాట్లాడుతున్నప్పుడు, ముఖ్యమంత్రి మాట్లాడినప్పుడు సభ్యులే గోల చేస్తారు. అరుస్తారు. బల్లలు కొడతారు. వీళ్లకే తెలియని క్రమశిక్షణ పిల్లలకి ఎలా తెలుస్తుందీ? ఇలాంటి పరిస్థితిలో. ఈవ్‌టీజింగ్‌ని, రాగింగ్‌ని ఎలా అరికట్టగలం చెప్పండి!!

ఆగండి...ఆగండి! కుక్కల బెడదలోంచి ఈవ్‌టీజింగ్‌లోకి వెళ్లాం. ఈవ్‌టీజింగ్ నుంచి ఢిల్లీ రాజకీయాల్లోకి వెళ్తే ఎలా?

"అసలు నిన్నటి ఈవ్‌టీజర్సే నేటి రాజకీయనాయకులు! అందుకే ఇలా ఉంది దేశం!" అంది ఓ అమ్మాయి.

"అమ్మా .... అమ్మా...! లేనిపోని గోల తీసుకురాకు! రాజకీయ నాయకుల జోలికి వెళ్లకుండా సమస్యని మనలో మనమే పరిష్కరించుకోవాలి!" అన్నాడు ఓ పెద్దాయన.

"అయినా, నీ మానాన నువ్వు చదువుకుని రావచ్చుగా! అమ్మాయిల్ని వేధించే అబ్బాయిల గురించి నీకెందుకూ?" అన్నది ఆ అమ్మాయి తల్లి.

"ఇలా ఎవరికి వారు ఊరుకోబట్టే ఈవ్‌టీజింగ్, రాగింగ్ ఒక వ్యాధిలా వ్యాపించిపోతోంది!" అన్నది ఆ అమ్మాయి.

"డాడీ! నేనో మాట చెప్పనా? ఈవ్‌టీజింగ్ అనేది ఒక సరదా అని, అమ్మాయిలే సర్దుకుపోవాలని .... ఇలా పెద్దవాళ్లంతా అశ్రద్ధ చేస్తూండబట్టే దేశంలో ఉగ్రవాదం పెరుగుతోంది. నేటి ఈవ్‌టీజర్సే రేపటి రౌడీలు, గూండాలూ, ఉగ్రవాదులూ! ఈవ్‌టీజింగ్ అనేది ఎలిమెంటరీ కోర్స్. రౌడీయిజం అనేది కాలేజీకోర్సు. ఉగ్రవాదం అనేది యూనివర్సిటీ డిగ్రీ! మనం ఈవ్‌టీజింగ్‌ని అశ్రద్ధ చేయడం వల్లనే ఇవాళ రాష్ట్రంలో ఉగ్రవాదం, రౌడీయిజం పెరుగుతున్నాయి. కుక్కల బెడద అలా కాదు, ఆ వీధివరకే ఉంటుంది!" అన్నది ఆవేశంగా ఆ కాలేజీ అమ్మాయి.

"నిజమే కదా! అమ్మాయి చెప్పింది కూడా మనం ఆలోచించాల్సిందే! మా రోజుల్లో ... అంటే పాతికేళ్లక్రితం సంగతి.. మా వూళ్లోకి ఓ పోలీసు ఆఫీసర్ వచ్చాడు. ఆ రోజుల్లో కూడా నేను చదువుకునే కాలేజీలో అమ్మాయిల్ని ఏడిపించే కుర్రాళ్లు ఉండేవారు. అంటే, ఇంత ఉధృతం కాదు. అయినా కూడా ... ఆ రోజుల్లో అమ్మాయిల్ని వేధించే కుర్రాళ్ల గురించి ఆ పోలీసు ఆఫీసర్ తెలుసుకుని, మా కాలేజీ దగ్గర మఫ్టీలో తిరిగేవాడు. అమ్మాయిల్ని ఏడిపించే కుర్రాళ్లని నేర్పుగా పట్టుకునేవాడు. పోలీస్ స్టేషన్‌కి తీసుకెళ్లి నున్నగా గుండు గీయించేవాడు! లాగూ చొక్కా విప్పేసి ... అవి ఆ మంగలికి ఇచ్చేసి వాళ్లని వదిలేసేవాడు. ఆ రకంగా మా కాలేజీలో ఈవ్‌టీజింగ్ కంట్రోల్ అయింది. కాకపోతే ఓసారి ఓ పత్రికా విలేఖరి కొడుక్కి కూడా ఈ విధంగా గుండు గీయించడంతో ఆ ఆఫీసర్‌ని మా ఊరు నుంచి బదలీ చేశారు!" అని చెప్పాడు తాతయ్య ... తన చిన్ననాటి సంగతి.

"నిజమే! ఈ రోజుల్లో కూడా అలా చేస్తే మంచిదేమో!" అన్నది ఆ అమ్మాయి.

"సర్లే, అలా చేస్తే, మన ఊళ్లో సగంమంది కుర్రాళ్లకి గుండ్లు చేయించాలి. ఇదేం ఆలోచించకు. ఎలాగూ ఆడవాళ్లకి ముప్పైమూడు శాతం రిజర్వేషన్లు వచ్చాయిగా. నువ్వు కూడా చదువు పూర్తి అయ్యాక ఏదైనా పదవి సంపాదించి ఆ కుర్రాళ్ల గురించి ఆలోచిద్దువుగాని! వెళ్లి బట్టలు మార్చుకో, టిఫిన్ తిందువుగాని!" అన్నది ఆ అమ్మాయిని కన్న తల్లి.

"ఆహా! ఆడవాళ్లకి అధికారాలు, పదవులు రావాల్సిందే! కాకపోతే మరీ జయలలిత, మాయావతీలాంటి మహిళామణులు రాకుండా ఉంటే మంచిది!" అంటూ ఆ అమ్మాయి తండ్రి వాళ్లావిడకు వినపడకుండా చిన్న జోక్ చేశాడు.

"డాడీ! అప్పుడే చాలామంది మహిళా మేయర్‌లు వచ్చేశారు మునిసిపాలిటీల్లో ... కార్పొరేషన్లలోకి. త్వరలో ఈవ్‌టీజర్స్ భరతం పట్టే రోజులు వచ్చేస్తున్నాయ్!" అన్నది కాలేజీ అమ్మాయి.

"మంచిదే! ఈవ్‌టీజర్స్ సంగతి అటుంచి ... మీ మహిళా మేయర్లు వీధికుక్కల్ని నిర్మూలించడానికి ... చంపేస్తారేమో! వద్దని చెప్పమ్మా! వీధి కుక్కలకి ఫామిలీ ప్లానింగ్ ఇంజక్షన్లు ఇచ్చి గానీ, లేదా మేనకగాంధీ, అమలా నాగార్జునలాంటివారి సంస్థలకి అప్పగించి గానీ వీధి కుక్కల నిర్మూలన చెయ్యమని చెప్పు!" అని చెప్పాను.

"సారీ! వీధి కుక్కలకంటే వీధి రౌడీల బెడదే ఎక్కువగా ఉంది. ముందు వాళ్లనే నిర్మూలించాలి!" అన్నది కాలేజీ అమ్మాయి.

మరి ... మీరేమంటారు?

■

ఒక ఆటోడ్రయివరు, ఒక మతప్రచారకుడు మరణానంతరం దేవుడిదగ్గరకి చేరారు. దేవుడు ఆటోడ్రయివరుకి స్వర్గం, మతప్రచారకుడికి నరకం ఇచ్చాడు. మతప్రచారకుడు లబోదిబో అని, "ఇదేమి అన్యాయం, స్వామీ, నేను నిన్నుగురించి ప్రచారం చేస్తే చివరకి నరకం ఇచ్చారు" అని అడిగాడు.

అందుకు భగవంతుడు, "నీవు ప్రచారం చేస్తుంటే జనం నిద్రపోయేవారు. ఒక్కడూ నన్ను తలచుకోలేదు. ఆటోలో ప్రయాణం చేస్తున్నవాళ్లు ఆటో దిగేదాకా నన్నే తలచుకుంటూ కూర్చునేవారు" అని బదులు చెప్పాడు.

కె. రామారావు,
హైదరాబదు